
ఆంధ్రజ్యోతి

గరిష్ఠం 32.0
కనిష్ఠం 24.4



యాదాద్రి భువనగిరి

5

గురువారం 15 ఆగస్టు 2024

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.5050)	590 (310.0450)	63,123	68,483
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	642.15 (3.73)	1232,51	515.78
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	171.61 (40.67)	25,399	12,400

చికెన్ ధరలు | లైవ్ : రూ.108 | డ్రెస్ : రూ.180 | స్కిన్‌లెస్ : రూ.200

నాణ్యమైన వైద్యసేవలందించాలి

● కలెక్టర్ హనుమంతు కే.జెండగే



వైద్యాధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

ఆలేరు రూరల్, ఆగస్టు 14: ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలందించాలని, లేదంటే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ హనుమంతు కే.జెండగే వైద్య సిబ్బందిని హెచ్చరించారు. బుధవారం ఆలేరులోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రభుత్వం ప్రజలకు సంపూర్ణ ఆరోగ్యం అందించాలనే లక్ష్యంతో ఉందని, ఈ విషయమై వైద్య సిబ్బంది నిర్లక్ష్యం చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా ఆస్పత్రి పరిసరాలు, పరీక్షలకు సంబంధించి కిట్లు, రాపిడ్ టెస్టులను పరిశీలించారు. స్వయంగా రోగుల వద్దకు వెళ్లి వైద్యసేవలు ఎలా అందుతున్నాయో అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించారు. కలెక్టర్‌తోపాటు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ స్వప్నరాథోడ్, డాక్టర్ శిరీష, డాక్టర్ రహీం ఉన్నారు.

రెడ్‌క్రాస్ సేవలను గ్రామాలకు విస్తరింపజేయాలి


● గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

● గవర్నర్‌ను కలిసిన రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్

మోత్కూరు, ఆగస్టు 14: రెడ్‌క్రాస్ సేవలను గ్రామాలకు విస్తరింపజేయాలని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ సూచించారని రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ డాక్టర్ గుర్రం లక్ష్మీనర్సింహారెడ్డి అన్నారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన గవర్నర్, ఇండియన్ రెడ్‌క్రాస్ రాష్ట్ర అధ్యక్షుడు జిష్ణుదేవ్ వర్మను రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రావుల మహేందర్‌రెడ్డితో కలిసి బుధవారం రాజ్‌భవన్‌లో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. రెడ్‌క్రాస్ సేవలను గ్రామీణ ప్రాంతాలకు మరింత విస్తరింపజేయాలని, అందుకు తన పూర్తి సహకారం ఉంటుందని గవర్నర్ హామీ ఇచ్చారని వారు చెప్పారు. రెడ్‌క్రాస్ రాష్ట్ర చైర్మన్ అజయ్‌మిశ్రా, ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం కార్యక్రమంలో పాల్గొన్నారు.



గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు చెబుతున్న రెడ్‌క్రాస్ చైర్మన్, సభ్యులు



స్వాతంత్ర్య ఫలం దక్కేనా

పల్లె వికసించేనా?

దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి 78 ఏళ్లు కావొస్తున్నప్పటికీ గ్రామీణ ఆర్థిక వ్యవస్థ మాత్రం చిన్నాభిన్నంగానే ఉంది. వ్యవసాయ రంగంపై 70నుంచి 80శాతం మంది ఆధారపడి ఉన్న పల్లెల్లో ఇప్పటికీ సమస్యలు తాండవిస్తూనే ఉన్నాయి. ఇంతవరకూ పలు పల్లెలు స్వాతంత్ర్య ఫలాలు పొందడంలో వెనుకబడే ఉన్నాయి. దీనికి ప్రధాన కారణం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలనుంచి స్థానిక సంస్థలకు నిధుల కేటాయింపు అరకొరగా ఉండడమే. నేడు స్వాతంత్ర్య వేడుకలు జరుపుకుంటున్న సందర్భంగా ఆ మహాత్ముడు కన్న కలలు ' గ్రామ స్వరాజ్యం' అమలుకు ఆమడదూరంలోనే ఉన్నాయి. 'దేశానికి పల్లెలే పట్టుగొమ్మలు' అన్న జాతిపిత ఆలోచనలకు పాలకులు తుది రూపం ఇవ్వడంలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

- నల్లగొండ

- గ్రామాల్లో రాజ్యమేలుతున్న సమస్యలు
- స్వాతంత్ర్యం సిద్ధించి 78 ఏళ్లు
- దెబ్బతింటున్న గ్రామీణ ప్రజల ఆర్థికస్థితిగతులు
- వ్యవసాయ రంగంపై నీలినీడలు
- పూర్తిగా అందుబాటులో లేని వైద్యం
- అస్తవ్యస్తంగా రోడ్లు, మంచినీటి పథకాలు
- బలహీనపడుతున్న స్థానిక సంస్థల వ్యవస్థ



పల్లెలో ఎక్కడ చూసినా అభివృద్ధికి ఆమడదూరంలో ఉన్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం నుంచి గ్రామీణ ప్రాంతాలకు నిధుల కేటాయింపు తక్కువగా ఉంటోంది. కేంద్ర ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం నుంచి విడుదల చేస్తున్న నిధుల నుంచే అన్ని పనులు చేపట్టాల్సి వస్తోంది. వచ్చిన నిధుల నుంచి గ్రామపంచాయతీల్లో పనిచేసే సిబ్బందికి జీతభత్యాలతోపాటు రోడ్లు, ఇతర అభివృద్ధి పనులకు వెచ్చించాల్సి వస్తుంది. గ్రామీణ ప్రజలకు అవసరాలకు సంబంధించిన కూడా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి సమకూర్చే పరిస్థితులు లేక పోవడంతో స్వాతంత్ర్యం వచ్చి ఇన్ని సంవత్సరాలు అయిన ప్రయోజనం లేదన్న భావన గ్రామీణ ప్రాంతాల ప్రజల నుంచి వ్యక్తమవుతోంది.

సంక్షోభంలో కూరుకున్న వ్యవసాయం



ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రి జిల్లాల్లో దాదాపు 21.50లక్షల ఎకరాల్లో పంటల విస్తీర్ణం ఉంటుంది. పెట్టుబడులు లేకపోవడం, ప్రకృతి వైపరీత్యాల మూలంగా వ్యవసాయం సంక్షోభంలో కూరకపోతుంది. ఒకప్పుడు దేశంలోనే ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఉద్యాన పంటలది మొదటిస్థానంలో ఉండేది. మూడున్నర లక్షల ఎకరాల్లో బత్తాయితోపాటు ఇతర పండ్లతోటలు సాగయిన పరిస్థితులు ఉండగా ప్రస్తుతం అన్ని ఉద్యాన పంటలు కలిసి కనీసం 65వేల ఎకరాల్లో మాత్రమే విస్తీర్ణంలో ఉంది. దీనికి కారణం ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం లేకపోవడం, రాయితీలు అందకపోవడం, తెగుళ్ల బెడద, వేరుకుళ్లు సమస్యలు, నీటి వనరులు తగ్గడం మూలంగా ఉద్యాన పంటలపై తీవ్ర ప్రభావం చూపిస్తుంది. ఇక వరి, పత్తి పంట విస్తీర్ణం ప్రధానంగా జిల్లాలో ఉంటుంది. అయితే వర్షభావ పరిస్థితుల మూలంగా మెట్ట ప్రాంతాల్లో అంటే నాన్ ఆయకట్టు ప్రాంతంలో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇక ప్రధాన నీటి వనరులైన సాగర్ ఆయకట్టు కింద ఈసారి సాగర్ జలాలు పుష్కలంగా ఉండటంతో వరి విస్తీర్ణం పెరగనుంది. ఇదిలా ఉంటే నాన్ ఆయకట్టులో మాత్రం బోరుబావులు అడుగంటిపోయాయి. భూగర్భజలాలపై ప్రభావం కనిపిస్తుంది. దీనికి ముఖ్య కారణం ఈ సంవత్సరం వర్షాలు భారీగా పడకపోవడంతో బోర్లు ఇంకిపోయాయి. ఇక కేవలం అడపదడప కురిసిన వర్షాలతో పత్తి పంటకు కొన్ని ప్రాంతాల్లో జీవం పోయగా, మిగతా ప్రాంతాల్లో పత్తి చేలు వాడు ముఖం పట్టిన పరిస్థితులు ఉన్నాయి. రుణమాఫీ విషయంలోనూ పూర్తిస్థాయిలో అమలు కాకపోవడంతో చాలామంది రైతులు ఆవేదన చెందుతున్నారు. రైతుబంధు స్థానంలో 'రైతుభరోసా' అనేది ఇప్పటికీ ఆచరణకు నోచలేదు. శ్రీశైలం సొరంగ మార్గం, నక్కలగండి ఎత్తిపోతల పథకం, బ్రాహ్మణవెల్లెంల ప్రాజెక్టు పూర్తి కాకపోవడంతో సాగునీటి వనరులపై ప్రభావం చూపిస్తుంది. ఇక అత్యధికంగా యాదాద్రి భువనగిరి జిల్లాలో ఉన్న మూసీ ప్రాజెక్టు మూలంగా కొన్ని ప్రాంతాల్లో ఉన్న రైతులకు మాత్రమే నీటి వనరులు అందుబాటులో ఉన్నాయి. ఇదిలా ఉంటే మార్కెటింగ్ సమస్య కూడా తీవ్రంగా ఉంది. బత్తాయికి సరైన మార్కెటింగ్ లేకపోవడంతో ఇప్పటికీ దళారులనే ఆశ్రయించాల్సిన పరిస్థితి ఉంది.

మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో ఏదీ అభివృద్ధి

15 ఏళ్ల క్రితం ఉన్న జిల్లా పరిషత్ పాలకవర్గాలకు మారుమూల గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికోసం ప్రతీ ఏటా రూ.35కోట్ల వరకు ప్రత్యేక నిధులు కేంద్ర ప్రభుత్వం నుంచి కేటాయించే వారు. గత మూడు విడతలు పాలకవర్గాలకు ఆ నిధులు లేకపోవడంతో గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధిపై ప్రభావం పడింది. ఇప్పటికే చాలా గ్రామాల్లో పూర్తిస్థాయిలో రోడ్ల నిర్మాణం లేకపోవడంతో పాటు చాలా చోట్ల గ్రామ పంచాయతీలకు భవనాలు కూడా లేవు. అధ్వానంగా ఉన్న రోడ్లతోపాటు వీధి లైట్ల నిర్వహణ లేకపోవడం, పారిశుధ్య సమస్యలు వెంటాడుతునే ఉన్నాయి. నిధులకొరత మూలంగా గ్రామీణ ప్రాంతాల్లో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. ఇప్పటికీ కొన్ని ఊర్లకు ఆర్టీసీ బస్సులు లేకపోవడంతో ప్రైవేట్ వాహనాలతో ముఖ్యంగా ఆటోలపై ఆధారపడుతున్నారు. వైద్య ఆరోగ్య శాఖ సైతం పల్లెలోకి వైద్యాన్ని చేరవేయలేక పోతుంది. మండలాల్లో ఉన్న పీహెచ్‌సీల్లో అరకొర వైద్యం ఉండటంతో ప్రజలు ప్రైవేట్‌ను ఆశ్రయిస్తున్నారు. దీని మూలంగా ప్రజలు ఆర్థికంగా ఇబ్బందులు ఎదురక్కొంటున్నారు. విద్యారంగం కూడా గాడిలో పడటంలేదు. ఇప్పటికీ బడిఈడు పిల్లలు బడి బయటే ఉండటం, డ్రాపవుట్స్ పెరగడం ఆందోళన కలిగిస్తుంది. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుబాటులో ఉన్నప్పటికీ సౌకర్యాల కొరతతో ప్రజలు తమ పిల్లలను పట్టణాల్లోని ప్రైవేట్ పాఠశాలలకే అత్యధికంగా పంపించడంతో చాలా గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలలు మూతపడుతున్నాయి.

తాగునీటి పథకాల నిర్వాహణపై అస్తవ్యస్తం



ఫ్లోరైడ్ విషపు నీటితో జీవచ్ఛవాలుగా మారిన ప్రజలకు గత ప్రభుత్వం మిషన్ భగీరథ పథకం కింద ఇంటింటికీ కృష్ణాజలాలను అందించడంకోసం పథకాన్ని చేపట్టినప్పటికీ అది పూర్తిస్థాయిలో అందుబాటులోకి రాలేదు. ఇప్పటికీ మూడు జిల్లాల్లోని చాలా గ్రామాల్లో ఇంటింటికీ నల్లా నీరు రావడంలేదు. పైపులైన్లు ధ్వంసం కావడం, వాటర్ ట్యాంకులు అరకొరగా ఉండటంతో పాటు వాటి నిర్వహణ కూడా అంతంత మాత్రంగా ఉండటంతో గ్రామీణ ప్రాంతాలకు కృష్ణాజలాలు పూర్తిస్థాయిలో అందడంలేదు. చాలా గ్రామాల్లో స్థానికంగా ఉన్న బోరునీటితోపాటు కృష్ణా జలాలను కలిపి సరఫరా చేస్తున్నారు. దీంతో స్వచ్ఛమైన నీరు అందక ప్రజలు రోగాల బారిన పడిపోతున్నారు. ముఖ్యంగా ప్రజలకు కావాల్సిన తాగునీటి పథకాలను అధికార యంత్రాంగం పట్టించుకోవడం లేదు. తాగునీటిని కొనుగోలు చేసి తాగడం ద్వారా ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మిషన్ భగీరథ ద్వారా తొలిదశలో సుమారు 600 గ్రామాలకు తాగునీటి సరఫరా చేయడం కోసం వేసిన పైపులైన్లలో పలు మార్లు దెబ్బతినడం వల్ల నీటి సరఫరాకు ఆటంకం కలుగుతుంది.

యువతా మేలుకో..

కోదాడ: వజ్రతుల్య శరీరం, ఉక్కు కండరాలు, అపారమైన జ్ఞాననిధితో యువ సంపద భారతదేశం సొంతమని నాడు వివేకానందుడు చెప్పిన మాటలను యువత పెడచెవిన పెడుతోంది. అందుబాటులో టెక్నాలజీ, అరచేతిలోకి వచ్చిన ప్రపంచ కుగ్రామం, కరోనాతో మారిన పరిస్థితులు, పాశ్చాత్య విష సంస్కృతి, మత్తుకు అలవాటు పడిన యువత నేడు మూడుపదుల వయస్సులోనే 80 ఏళ్లకు చేరింది. నిస్సహాయస్థితిలో, నిస్సత్తువుగా ఉంటూ ప్రపంచానికి సవాల్ విసరాల్సిన యువశక్తి మనుగడ ప్రశ్నార్థకంగా మారిందన్న విమర్శలున్నాయి. పెద్దలు, గురువులు, భవిష్యత్ అంటే భయం లేకుండా పోయి, అంధకార పరిస్థితి కళ్ల ముందే కనిపిస్తుందంటున్నారు. అపార యువతను, వారి శక్తిని సన్మార్గంలో పెట్టేందుకు కేంద్రం చర్యలు తీసుకుంటోంది. మత్తుకు బానిసై, అరాచకాలు, అత్యాచారాలు, అక్రమాలు, అవినీతికి పాల్పడే వారిపై కఠిన చర్యలకు పూనుకుంటోంది. 20 ఏళ్లలోపు యువతకు సాంకేతిక(సెల్‌ఫోన్) అందుబాటులోకి లేకుండా చూడాలని, 1.5, 2జీబీ అంటూ యువతను పెడదోవలోకి నెడుతున్న సంస్థలను నిర్మూలించాలని మేధావులు సూచిస్తున్నారు. చదువుకున్న ప్రతీ ఒక్కరికి ఉపాధి మార్గాలను చూపించాలని డిమాండ్ చేస్తున్నారు. కాగా ఉమ్మడి జిల్లాలో సుమారు 39లక్షల జనాభా ఉంటే వారిలో 9లక్షలు(23శాతం) యువత ఉన్నారు. వారిలో ఆరేళ్లలోపు 3లక్షల మంది చిన్నపిల్లలు ఉన్నారు.



ఇన్నాళ్లూ చాలా నష్టపోయా..

ఇన్నాళ్లు పాశ్చాత్య పోకడలకు అలవాటు పడి చాలా నష్టపోయా. ఫ్రెండ్స్ టూర్‌లు అంటూ ఇష్టం వచ్చినట్టు తిరిగా. కానీ అవి శాశ్వతం కాదని తెలిసింది. చెడు వ్యసనాలకు దూరంగా ఉంటా. నిజమైన సహజ జీవనశైలిని కొనసాగిస్తూ, భావితరలకు బాటలు వేయటంతోపాటు, సాంకేతికతతో వచ్చే ఇబ్బందులను విద్యార్థులకు వివరిస్తూ, దేశ భవిషత్‌లో భాగస్వామ్యవుతా. ఆగస్టు 15 జెండా పండుగలో పాల్గొని దేశ సమైక్యత, సమగ్రతను చాటుతా.

నరేష్, కోదాడ

ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయం

» ప్రతీ గ్రామానికి తాగునీటి సౌకర్యం కల్పించడమే లక్ష్యం » భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి



లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు అందజేస్తున్న ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే కుంభం

భూదాన్‌పోచంపల్లి, ఆగస్టు 14: ప్రజా సంక్షేమమే ప్రభుత్వధ్యేయం అని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, భువనగిరి ఎమ్మెల్యే కుం భం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలో ని జూలూరు ప్రభుత్వ పాఠశాలలో అదనపు గదు ల నిర్మాణానికి శంకుస్థాపన, భూదాన్‌పోచంపల్లి పట్టణంలోని ఏడో వార్డులో ఏర్పాటు చేసిన అమృత్-2 నిధులు రూ.17.50లక్షలతో నిర్మించిన ఓహెచ్‌ఎస్‌ఆర్ ట్యాంకు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.అనంతరం మండల పరిషత్ కార్యాలయం లో మండలవ్యాప్తంగా ఆయా గ్రామాలకు చెందిన 26మందికి కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను, 84 సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ పదేళ్ల ఆచరణ యోగ్యం కాని పథకాలతో గత పాలకులు ప్రజల్ని మోసం చేశారన్నా రు. గత బీఆర్ఎస్ పాలకుల నిర్లక్ష్యం నేడు ప్రజల కు శాపంగా మారిందన్నారు. తెలంగాణ ప్రజల సంక్షేమం లక్ష్యంగా సీఎం రేవంత్‌రెడ్డి ముందుకు సాగుతున్నారన్నారు. రైతులకు ఏక కాలంలో రూ2 లక్షలు రుణమాఫీ చేసిన చేసిన ఘనత సీఎం దక్కుతుందన్నారు.ప్రభుత్వం చేపడుతున్న ప్రజా సంక్షేమ పథకాలను జీర్ణించుకోలేని బీఆర్ఎస్, బీజేపీ నాయకులు అసత్య ఆరోపణలు చేస్తున్నారని,వాటిని ప్రజలు పట్టించుకోవద్దన్నారు.ప్రజలకు తాగునీటిని అందించే లక్ష్యం తో తాత్కాలికంగా భు వనగిరి నియోజకవర్గంలో 64వాటర్‌ఫిల్టర్ ప్లాం ట్లు, సీఎస్ఆర్ ఫండ్స్ ద్వారా ఏర్పాటు చేస్తున్నామ ని, భూదాన్‌పోచంపల్లి మండ ల వ్యాప్తంగా 23 వాటర్ ఫిల్టర్ ప్లాంట్లు ప్రారంభిస్తున్నామన్నారు.

ఇద్దరం కలిసి అభివృద్ధి చేస్తాం

ఈ ప్రాంత అభివృద్ధికి ఇద్దరం సమష్టి కృషి చేస్తామని కిరణ్‌కుమార్‌రెడ్డి, అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా జడ్పీహెచ్‌ఎస్ బాలుర పాఠశాలలో అభినవ యూత్ ఆధ్వర్యంలో సరస్వతీదేవి విగ్రహాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు తమ సమస్యలపై వారికి వినతిపత్రాలు అందజేశారు. ఆశావర్కర్లు కనీస వేతనం రూ.18వేలు అందించాలని, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు తమ సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు. ఆదర్శనగర్ కాలనీ ప్రజలకు సీసీ రోడ్డు ఏర్పాటు చేయాలని కోరుతూ వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమాల్లో మునిసిపల్ చైర్‌పర్సన్ చిట్టిపోలు విజయలక్ష్మీశ్రీనివాస్, తహసీల్దారు శ్రీకాంత్‌రెడ్డి, ఎంపీడీవో రాపర్తి భాస్కర్, మునిసిపల్ కమిషనర్ కె వీరారెడ్డి, వైస్ చైర్మన్ బాత్క లింగస్వామియాదవ్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ సామ మోహన్‌రెడ్డి, కౌన్సిలర్లు సామల మల్లారెడ్డి, గుండు మధు, బోగ భానుమతి విష్ణు,మోటె రజిత రాజు, కర్నాటి రవీందర్, దారెడ్డి మంజుల వేణుగోపాల్‌రెడ్డి, సుర్కంటి జ్యోతి రంగారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తడక వెంకటేష్, పాక మల్లేష్‌యాదవ్, భారత లవకుమార్, డీసీసీ ఉపాధ్యక్షులు కళ్లెం రాఘవరెడ్డి, సామ మధుసూదన్‌రెడ్డి, అర్బన్ బ్యాంకు చైర్మన్ తడక రమేష్ తదితరులు పాల్గొన్నారు.

78వ స్వాతంత్ర్య వేడుకలకు

సర్వం సిద్ధం

జిల్లా అంతటా మువ్వన్నెల పండుగ సందడి



విద్యుద్దీపాల వెలుగుల్లో కలెక్టరేట్ భవనం

భువనగిరి టౌన్, భువనగిరి అర్బన్, ఆగస్టు 14: జిల్లాలో 78వ స్వాతంత్ర్య వేడుకలకు ఏర్పాట్లు పూర్తి చేశారు. గురువారం జిల్లాలోని ప్రతీ పల్లె, బస్తీలో మువ్వన్నెల జెండాను ఎగురవేసేందుకు ప్రజలు సిద్ధమయ్యారు. భువనగిరిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణ, కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి స్వాతంత్ర్య వేడుకలకు ఏర్పాట్లు పూర్తిచేశారు. ఉదయం 9.30 గంటలకు శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించి జిల్లా ప్రగతిపై ప్రసంగించనున్నారు. అనంతరం అభివృద్ధి పథకాల శకటాల ప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాలు, ఆస్తుల పంపిణీ, ప్రశంసాపత్రాల ప్రదానోత్స వం తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఇందుకోసం కళాశాల ఆవరణలో ఏర్పాట్లను పూర్తిచేశారు. సభా వేదిక, ఆహుతులకు, ప్రదర్శనలకు అనువైన ఏర్పాట్లు చేశారు. మునిసిప ల్ కమిషనర్ పి.రామాంజుల్‌రెడ్డి, తదితర అధికారులు ఏర్పాట్లను బుధవారం పరిశీలించా రు. కలెక్టరేట్ తదితర ప్రభుత్వ కార్యాలయాలు, మహనీయుల విగ్రహాలను విద్యుద్దీపాలతో అలంకరించారు. ప్రజలందరూ తమ ఇళ్లపై జాతీయ జెండాలను ఎగురవేయనున్నారు. పాఠశాలలు, కార్యాలయాల్లో రోజంతా ఆటల పోటీలు కొనసాగాయి. జిల్లాస్థాయి వేడుకలతోపాటు అంతటా పోలీసులు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఛాయా చిత్రాల ప్రదర్శన

కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖకు చెందిన సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ ఆధ్వర్యంలో బుధవారం భువనగిరిలో తెలంగాణ స్వాతంత్ర్య సమరయోధుల చాయాచిత్ర ప్రదర్శనను ఏర్పాటుచేశారు. మునిసిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు చాయాచిత్రాల ప్రదర్శనను ప్రారంభించి మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుల స్ఫూర్తిని నేటితరం కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రచార శాఖ అధికారి కోటేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు. ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ కేడెట్లు పలు ప్రదర్శనలు నిర్వహించారు. ప్రతిభా పాటవ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. అలాగే పార్టీషియన్ హర్రర్స్ రిమెంబర్స్ డేను పురస్కరించుకొని లీడ్ బ్యాంక్, కెనరా బ్యాంక్‌ల ఆధ్వర్యంలో 1947నాటి హింసాత్మక ఘటనలు, బాధితుల ఫొటో ప్రదర్శనను ఏర్పాటు చేశారు. జిల్లా పశుసంవర్థక శాఖ అధికారి వి.కృష్ణ, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ శ్యాంసుందర్, ఏపీజీవీడీ రీజనల్ మేనేజర్ శ్రీనివాస్ ఎల్‌డీఎం శివరామకృష్ణ, తదితరులు ఫొటో ప్రదర్శనలు ప్రా రంభించి మాట్లాడారు. స్వాతంత్ర్య సమరయోధురాలు కృష్ణాదేవి కుటుంబ సభ్యులు తదితరు లు పాల్గొన్నారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని బీజేవైఎం ఆధ్వర్యంలో భువనగిరిలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. మునిసిపల్ వైస్‌చైర్మన్ మాయ దశరథ, బీజేవైఎం జిల్లా అధ్యక్షులు పట్నం కపిల్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చందా మహేందర్‌గుప్తా, తదితరులు బైక్ ర్యాలీ ప్రారంభించి మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్య ఫలాలను అందరూ సమానంగా అనుభవించాలన్నారు. పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాదం ఆకుపై స్వాతంత్ర్య శుభాకాంక్షలు



దేశమంతటా స్వాతంత్ర దినోత్సవ సంబరాలు వెల్లివిరుస్తున్న వేళ ఓ ఉపాధ్యాయుడు బాదం ఆకుపై వినూత్న రీతిలో శుభాక్షాంక్షలు తెలిపారు. భువనగిరి మైనార్టీ గురుకుల పాఠశాల, కళాశాల క్రాఫ్ట్ టీచర్ శ్రీను బాదం ఆకుపై 33 జిల్లాలతో కూడిన తెలంగాణ చిత్రపటాన్ని, మువ్వన్నెల జెండాతో 78వ స్వాతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుతూ వేసిన పెయింటింగ్ చూపరులను ఆకట్టుకుంటోంది. అతని కళాత్మకతను ప్రిన్సిపాల్ జి.శ్రీకాంత్‌తో పాటు పలువురు టీచర్లు అభినందించారు.

- భువనగిరి టౌన్

జ్వరాల నియంత్రణకు చర్యలు చేపట్టాలి : సీఎస్






హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న సీఎస్ శాంతికుమారి,పాల్గొన్న అధికారులు

భువనగిరి అర్బన్, ఆగస్టు 14: జ్వరాల నియంత్రణకు చర్యలు చేపట్టాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి కలెక్టర్లకు సూచించారు. హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో ఆమె కలెక్టర్లతో మాట్లాడారు. సీజనల్ వ్యాధులు, 'స్వచ్ఛదనం-పచ్చదనం' కార్యక్రమాలపై వివరించారు. చికెన్‌గూన్యా, డెంగీ ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ రెసిడెన్షియల్, వసతిగృహాలను పరిశీలిస్తూ అవసరమైన చోట వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు.

గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో సీజనల్ వ్యాధుల నివారణపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. 'స్వచ్ఛదనం-పచ్చదనం' కార్యక్రమం నిరంతరం నిర్వహించాలని, విరివిగా మొక్కలు నాటాలన్నారు. అనంతరం అధికారులతో కలెక్టర్ హనుమంతు కే.జెండగే మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. అవసరమైన చోట ప్రత్యేకంగా వైద్యశిబిరాలు చేపట్టాలన్నారు. నీటి నిల్వల నిర్మూలనలకు ఆయిల్ బాల్స్ వాడాలని, నీటి గుంతలను పూడ్చాలన్నారు. కాన్ఫరెన్స్‌లో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.




దేశ సౌభాగ్యమంతా యువత చేతుల్లోనే..

గుజరాత్‌లోని నడియాడ్‌లో అక్టోబరు 31న జన్మించారు. భారత దేశ ఉక్కు మనిషి.. భారత బిస్మార్క్‌గా పేరొందిన సర్దార్ వల్లభాయ్ పటేల్ ఆధునిక భారత సివిల్ సర్వీస్ వ్యవస్థను ఏర్పాటు చేశారు. దేశ సౌభాగ్య మంతా యువత చేతుల్లోనే ఉంటుందని పేర్కొనేవారు. దేశంలోని 565 సంస్థానాలను ఒక్కటి చేసిన ఘనత పటేల్ కే దక్కుతుంది. అంబేడ్కర్‌ను డ్రాఫ్టింగ్ కమిటీ అధ్యక్షుడిగా నియమించడంలోనూ ఈయన పాత్ర కీలకం. భారతదేశ మొదటి హోంమంత్రిగా, ఉప ప్రధానిగా పనిచేశారు. ఈయన దేశానికి చేసిన సేవలకు గుర్తుగా నర్మదా నదిపై సర్దార్ సరోవర్ డ్యాం (గుజరాత్)లో స్టాచ్యూ ఆఫ్ యూనిటీ పేరుతో 182 మీటర్ల ఎత్తయిన విగ్రహాన్ని నరేంద్ర మోదీ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఇది ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన విగ్రహంగా ప్రసిద్ధి చెందింది.




రొట్టెలకు బదులు రాళ్లు పొందారు

పంజాబ్‌లో జన్మించిన లాలా లజపతి రాయ్ 'ఆర్య సమాజం నాతల్లి, వైదిక ధర్మం నా తండ్రి' అనే నినాదం ఇచ్చారు. హిందూ సంఘటన్ పేరుతో హిందూ, ముస్లింల ఐక్యతకు కృషి చేశారు. 'బ్రిటీష్ వారి నుండి రొట్టెలకు బదులు రాళ్లు పొందారు' అని మితవాదులనుద్దేశించి విమర్శించారు. 'మన మీద పడుతున్న ఒక్కో లాఠీ దెబ్బ బ్రిటన్ స్వయంగా నిర్మించుకుంటున్న తన శవపేటిక మీదిక మేకే' దిగుతుందన్నారు.



దమ్ముంటే కాల్చుకోండి..

గుజరాత్‌లోని పోర్‌బందర్‌లో జన్మించిన మోహన్‌దాస్ కరమ్ చంద్ గాంధీ ఉన్నత చదువుల కోసం దక్షిణాఫ్రికాకు వెళ్లి 1915, జనవరి 9న స్వదేశానికి తిరిగి వచ్చారు. బీహార్‌లోని రైతుల కోసం మొట్టమొదటి ఉద్యమం చంపారన్ సత్యాగ్రహం చేపట్టారు. 'శాంతి, అహింసే' తన ధ్యేయమే గాంధీకి ఓసారి తీవ్రమైన కోపం వచ్చింది. రౌలట్ చట్టానికి వ్యతిరేకంగా జరుగుతున్న ఉద్యమ సమయంలో 'దమ్ముంటే కాల్చుకోండి' అని బ్రిటీష్ వారి తుపాకీకి ఎదురుగా వెళ్లి సవాల్ విసిరాడు. కానీ ఆ అధికారులు ఆ సమయంలో వెనుదిరిగి పోయారు. మహాత్మాగాంధీని జాతిపిత అని సుభాష్ చంద్రబోస్ తొలిసారి పిలిచారు. మహాత్మా అని రవీంద్రనాథ్ ఠాగూర్, బాపూజీ అని జవహర్‌లాల్ నెహ్రూ పిలిచారు.'పునర్జన్మ అంటూ ఉంటే వచ్చే జన్మలో నేను అస్పృశ్యునిగా పుట్టాలి'అని ఆయన ప్రకటించుకున్నారు.



ప్రతీ కంట కన్నీరు తుడవడమే నా అంతిమ లక్ష్యం

అహ్మద్‌బాద్‌లో జన్మించిన జవహర్‌లాల్ నెహ్రూ ఆధునిక భారత నిర్మాతగా ఎంతో గుర్తింపు పొందారు. ఇతన్ని 'కమ్యూనిస్టు సిద్ధాంతాల పూజారి' అని కూడా పిలుస్తారు. 1936లో లక్నో సమావేశంలో 'సామ్యవాదం' అనే భావనను మొదటగా ప్రవేశపెట్టారు. గాంధీ పిలుపు మేరకు సహాయ నిరాకరణ ఉద్యమంలో పాల్గొన్నారు. కుటుంబ రీత్యా శ్రీమంతుడైనప్పటికీ స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొని అనేకమార్లు సాధారణ ఖైదీల్లా జైలు జీవితం గడిపారు. 'ప్రతి కంటి నుండి కారే కన్నీరు తుడవడమే తన అంతిమ లక్ష్యం' అని ప్రకటించారు. భారతదేశంలో మానవ హక్కుల ఉద్యమానికి నాంది పలికారు. భారత దేశ మొట్టమొదటి ప్రధానిగా పనిచేశారు.



యాదగిరి క్షేత్రంలో పవిత్రోత్సవాలకు శ్రీకారం

భువనగిరి అర్బన్, ఆగస్టు 14: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో బుధవారం పవిత్రోత్సవాలకు శ్రీకారం చుట్టారు. ప్రధానాలయంతో పాటు అనుబంధ ఆలయమైన పాతగుట్ట ఉభయ ఆలయాల్లో ప్రధాన అర్చక బృందం వేడుకలను నిర్వహించింది. ప్రాకారంలోని అద్దాల మండపం ముఖ మండపంలో అంకురార్పణతో పవిత్రోత్సవాలను పాంచరాత్రాగమశాస్త్రరీతిలో ప్రారంభించారు. స్వస్తివాచనం, విశ్వక్సేనుడికి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేక వేదికపై ప్రధాన కలశాలను ఏర్పాటు చేసి గంగాజలంతో గర్భాలయంతో పాటు ఆలయ పరిసరాలు, భక్తుల క్యూలైన్లను సంప్రోక్షణ చేశారు. ఆలయంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన యాగశాలలో అంకురార్పణ చేశారు. 12 పాలికల్లో(మట్టి పాత్రలు) పుట్ట మట్టిని తెచ్చి వాటిలో నవధాన్యాలు, పంచామృతాలను నింపి ప్రత్యేక పూజలు, దేవతామూల మంత్రాలతో హవనం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్త బీఎన్‌నరసింహమూర్తి, ఈవో భాస్కర్‌రావు, ప్రధానార్చకుడు నల్లంథిఘళ్ లక్ష్మీనరసింహాచార్యులు, కాండూరి వెంకటాచార్యులు, డీఈవో దోర్బల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



ప్రధానాలయంలో పవిత్రోత్సవాల సందర్భంగా పూజలు నిర్వహిస్తున్న అర్చకులు



సంప్రోక్షణ నిర్వహిస్తున్న అర్చకులు

లక్ష్మీనృసింహుడికి నిత్య పూజలు

యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారి ఆలయంలో బుధవారం నిత్య పూజలు వైభవంగా జరిగాయి. సుప్రభాతంతో స్వామి అమ్మవార్లను మేల్కొలిపిన అర్చకులు గర్భగుడిలో కొలువైన స్వయంభువులను, సువర్ణ ప్రతిష్ఠామూర్తులను అభిషేకించి తులసీదళాలతో సహస్రనామార్చనలు జరిపారు. ప్రధానాలయ అష్టభుజి ప్రకార మండపంలో స్వామి అమ్మవార్లను అలంకరించి ప్రత్యేక వేదికపై తీర్చిదిద్ది సుదర్శన శతక పఠనాలతో హవనం నిర్వహించారు. అనంతరం గజవాహన సేవలో ఊరేగించి నిత్య తిరుకల్యాణోత్సవ పర్వాలు నిర్వహించారు. సాయంత్రం ముఖ మండపంలో దర్బార్ సేవోత్సవం చేపట్టిన అర్చకులు అలంకార వెండి జోడు సేవలు, సహస్రనామార్చనలు జరిపారు. పాతగుట్ట ఆలయంలో నిత్య పూజలు కొనసాగాయి. కొండపైన శివాలయంలో రుద్రహవనం నిర్వహించారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.15,77,665 ఆదాయం సమకూరినట్లు ఈవో భాస్కర్‌రావు తెలిపారు.

ముందురోజే సంతకం.. ఇద్దరికి ఆబ్సెంట్

నేరేడుచర్ల, ఆగస్టు 18: ఒక రోజు ముందుగానే హాజరుపట్టికలో వైద్యాధికారి సంతకం చేయడం, ఇద్దరు సిబ్బందికి ఆబ్సెంట్, మరొకరికి సీఎల్ వేయటం సూర్యాపేట జిల్లాలో చర్చనీయాంశమైంది. బుధవారం నేరేడుచర్ల మండలం పెంచికల్‌దిన్నె పీహెచ్‌సీలో జరిగిన ఈ ఘటనను జిల్లా కలెక్టర్ దృష్టికి వెళ్లగా పూర్తి స్థాయిలో విచారణ చేసి చర్యలు తీసుకుంటామన్నారు. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. పెంచికల్‌దిన్నె ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి సహ 17మంది సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు. ఉపేంద్ర అనే మహిళా సిబ్బంది మంగళవారం క్యాజువల్ లీవ్ (సీఎల్) తీసుకోగా, బుధవారం విధులకు హాజరయ్యారు. సంతకం పెట్టేందుకు ఆమె హాజరుపట్టిక చూడగా బుధవారానికి సీఎల్‌గా నమోదై ఉండటం, గురువారానికి ఆబ్సెంట్ వేసి ఉంది. దీంతో 14వ తేదీన హాజరైనట్టు ఉపేంద్ర సంతకం చేశారు. తర్వాతిరోజైన 15వ తేదీన తాను విధులకు గైర్హాజరైనట్టు నమోదుచేయడంతో సహచర సిబ్బందికి చెప్పి బోరుమనడంతో విషయం వెలుగుచూసింది. స్థానికులు అందించిన సమాచారం మేరకు విలేకరులు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లగా, వైద్యాధికారి డాక్టర్ సీతామహాలక్ష్మి అనుపస్థితిలో లేరు. ఇప్పుడే బయటకు వెళ్లారని సిబ్బంది సమాధానమిచ్చారు. ఆసుపత్రిలో ఉన్న సీసీ కెమెరాలు పని చేయడం లేదు. హాజరు పట్టికలో 15వ తేదీకి సైతం వైద్యాధికారి సంతకం చేయగా, మరో ఇద్దరు సిబ్బంది నాగేశ్వరరావు, ఉపేంద్రకు గురువారం ఆబ్సెంట్ వేశారు. స్వాతంత్ర్య దినోత్సవం నిర్వహించనున్న పతాకావిష్కరణకు సిబ్బంది మొత్తం హాజరు కావల్సి ఉండగా, ఇద్దరు సిబ్బందికి ముందుగానే ఆబ్సెంట్, సీఎల్ నమోదు చేయడంపై విలేకరులు డీఎంహెచ్‌వో కోటా చలం దృష్టికి తీసుకెళ్లారు. ఈ ఘటనపై వైద్యాధికారిపై వచ్చిన ఆరోపణలపై విచారణ చేసి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. మరుసటి రోజు సంతకం చేసిన విషయాన్ని విలేకరులు కలెక్టర్ తేజస్‌నందలాల్‌పవార్ దృష్టికి తీసుకువెళ్లగా, వివరాలు పంపగా, పూర్తి స్థాయిలో విచారణ చేసి వైద్యాధికారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

విషాహారం తిని నెమలి మృతి

● సూర్యాపేట జిల్లా గరిడేపల్లిలో ఘటన

గరిడేపల్లి, ఆగస్టు 14: సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండల పరిధిలోని కాచవరిగూడెంలో అస్వస్థతకు గురైన నెమలి చికిత్స పొందుతూ మృతిచెందింది. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన రైతు తంగెళ్ల లక్ష్మయ్య బుధవారం ఉదయం ఆరు గంటల సమయంలో తన పొలం వద్దకు వెళ్లగా, ఓ నెమలి అస్వస్థతతో కొట్టుకుంటూ కన్పించింది. వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారమివ్వడంతో వారు లక్ష్మయ్య ఇంటికి చేరుకుని నెమలిని స్వాధీనం చేసుకున్నారు. అస్వస్థత గురైన నెమలి నోటి నుంచి నురగ వస్తుండటం, మందు కలిపిన ఆహారం తిని ఉండవచ్చని అధికారులు గుర్తించారు. హుజూర్‌నగర్‌లోని వెటర్నరీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. తమ పరిధి కాదని గరిడేపల్లి వెటర్నరీ ఆస్పత్రికి తీసుకెళ్లాలని అక్కడి సిబ్బంది సూచించగా, గరిడేపల్లి తీసుకువచ్చారు. అనంతరం డాక్టర్ రవి చికిత్స చేస్తుండగా, నెమలి మృతిచెందింది. నెమలి కళేబరానికి పోస్టుమార్టం నిర్వహించి వద్ద గింజలు ఉన్నట్లు గుర్తించారు. వరి పొలాలు లేని సమయంలో వడ్ల గింజలు ఎలా వచ్చాయని అటవీ అధికారులు రైతు లక్ష్మయ్యను ప్రశ్నించగా ఎలుకల బారి నుంచి పంట పొలాలను కాపాడుకునేందుకు రైతులు వడ్లు, బియ్యం, నూకలు వంటి వాటిలో ఎలుకల మందు కలిపి వరాలపై పెడతారని చెప్పారు. కాచవరిగూడెం గ్రామ శివారులో పెద్ద బండరాళ్లు ఉండడంతో అప్పుడప్పుడు నెమళ్లు వస్తుంటాయని తెలిపారు.



బతికి ఉన్నప్పుడు కాచవరిగూడెంలో నెమలిని అధికారులకు అప్పగిస్తున్న రైతు లక్ష్మయ్య

ఆన్‌లైన్ లింకుతో టోకరా

● ఇద్దరి ఖాతాలనుంచి నగదు ఊడ్చివేత

● ఒకరివి రూ.40వేలు, మరొకరివి రూ.36వేలు

భువనగిరి రూరల్, ఆగస్టు 14: తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించవచ్చని పరిచయం లేని వ్యక్తులు చెప్పిన మాటలు విని ఆన్‌లైన్ లింకును ఓపెన్ చేసి ఇద్దరు వ్యక్తులు వేర్వేరు చోట్ల తమ బ్యాంకు ఖాతాలనుంచి నగదును కోల్పోయారు. భువనగిరి రూరల్ ఎస్ఐ విసంతోష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. భువనగిరి మండలం బండసోమారం గ్రామానికి చెందిన కొల్పూరి బాలరాజుకు ఆన్‌లైన్‌లో పార్ట్‌టైం జాబ్ ద్వారా టాస్కులు చేస్తే తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించవచ్చునని గుర్తు తెలియని వ్యక్తులు లింకు పంపించగా ఆ లింకు ఓపెన్ చేయడంతో కొల్పూరి బాలరాజు బ్యాంకు ఖాతా నుంచి రూ. 40వేలు పోగొట్టుకున్నాడు. భువనగిరి రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రాయగిరికి చెందిన శనిగాల నర్సింగ్‌రావు, డిలీవర్ యాప్ ద్వారా లోన్ ఇప్పించుతామని గుర్తు తెలియని వ్యక్తులు ఆయనకు ఫోన్ చేసి మెసేజ్ పెట్టడంతో అతని వివరాలు గుర్తు తెలియని వ్యక్తులు ఆయన వివరాలు తెలుసుకుని అతని బ్యాంకు ఖాతా నుంచి రూ. 36వేలను కాజేశారు. దీంతో ఇరువురు బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తులు ఆన్‌లైన్‌లో పెట్టిన మెసేజ్‌లకు స్పందించి మోసపోవద్దని వెంటనే 1930 సైబర్‌క్రైం కాల్ చేసి దరఖాస్తు నమోదు చేసుకోవాలని ఎస్ఐ సంతోష్ కుమార్ కోరారు.

42 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

చింతపల్లి, తిప్పర్తి, ఆగస్టు 14: నల్లగొండ జిల్లాలోని చింతపల్లి, తిప్పర్తి మండలాల్లో బుధవారం 42 క్వింటాళ్ల రేషన్‌బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. చింతపల్లి ఎస్ఐ యాదయ్య తెలిపిన వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండలం ఎక్వాయిపల్లి గ్రామానికి చెందిన జెనిగల మహేష్ మల్లారెడ్డిపల్లి నుంచి మాడ్గుల్ వైపునకు ఆటోలో తరలిస్తున్న 30 క్వింటాళ్ల రేషన్‌బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు బాధ్యుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. తిప్పర్తి ఎస్ఐ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. భువనగిరి మండలం ఆత్మకూరుకు చెందిన బాతోలు మోహన్ మండల పరిధిలోని పలు గ్రామాల్లో 12 క్వింటాళ్ల బియ్యాన్ని సేకరించాడు. సేకరించిన బియ్యాన్ని అధిక ధరకు విక్రయించడానికి మినీ గూడ్స్ టీఎస్ 07యూసీ 6447 గల నెంబరు గల వాహనంలో నకిరేకల్ వైపు తరలిస్తుండగా మామిడాల స్టేజీ సమీపంలో పోలీసులు పట్టుకున్నారు. బియ్యం తరలిస్తున్న వ్యక్తి, వాహనంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తిప్పర్తి ఎస్ఐ రాజు తెలిపారు.

కుక్కదాడిలో ముగ్గురు చిన్నారులకు గాయాలు

కొండమల్లేపల్లి, ఆగస్టు 14: నల్లగొండ జిల్లా మండలంలోని చిన్నఅడిశర్లపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని బుగ్గతండాలో బుధవారం ఒక కుక్క పిల్లలపై ముగ్గురు చిన్నారులను తీవ్రంగా గాయపరిచింది. తండావాసులు తెలిపిన ప్రకారం.. తండాకు చెందిన ఇస్లావత్ నరేష్-ప్రియాంక దంపతుల కుమార్తె తన్విత, సంతు-మంజుల దంపతుల కుమారుడు రాజు, మూడావత్ కృష్ణ- బుజ్జిల కుమారుడు పవన్ తమ ఇంటి ఎదుట ఆడుకుంటున్నారు. ఓ కుక్క వారి వద్దకు వచ్చి ఒకరి తర్వాత ఒకరిని తీవ్రంగా గాయపర్చింది. గమనించిన స్థానికులు తరుముడంతో కుక్క అక్కడి నుంచి పారిపోయింది.

నేడు ఇండియన్ పోలీస్ మెడల్ అందుకోనున్న శ్రీనివాస్

చౌటుప్పల్ రూరల్, ఆగస్టు 14: చౌటుప్పల్‌లో ట్రాఫిక్ ఏఎస్ఐగా కట్టంగూర్ శ్రీనివాస్ 2022 సంవత్సరానికి కేంద్ర ప్రభుత్వం అందించే ఇండియన్ పోలీస్ మెడల్‌కు ఎంపికైనారు. ఈనెల 15వ తేదీన గోల్కొండ కోటలో సీఎం రేవంత్‌రెడ్డి నుంచి ఆయన మెడల్ అందుకోనున్నారు. ఎస్‌బీ ఏఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న సమయంలో చేసిన సేవలకు గాను ఆరేళ్ల రివార్డులు, ప్రశంసా పత్రాలు అందుకున్నారు. ఆయన సేవలు గుర్తించిన కేంద్ర ప్రభుత్వం 2022సంవత్సరానికిగాను ఇండియన్ పోలీస్ మెడల్‌కు ఎంపికయ్యారు.



పూర్తిస్థాయికి చేరుకున్న సాగర్ నీటిమట్టం

● నిండుకుండలా సాగర్ జలాశయం

● రెండు గేట్ల నుంచి నీటి విడుదల



రెండు గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు, నీటి మట్టం సూచి

నాగార్జునసాగర్, ఆగస్టు 14: ఎగువనుంచి వస్తున్న వరదతో నాగార్జునసాగర్ జలాశయం పూర్తి స్థాయి నీటిమట్టానికి చేరుకోగా, రెండు క్రస్ట్‌గేట్ల నుంచి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఈ నెల 5వ తేదీన క్రస్ట్‌గేట్లను ఎత్తి ప్రాజెక్టు అధికారులు దిగువకు నీటిని విడుదల చేయగా, వరద రాక స్వల్పంగా తగ్గటంతో 12వ తేదీన క్రస్ట్‌గేట్లు మూసివేశారు. ఎగువనుంచి స్వల్పంగా వరద రాక కొనసాగుతుండటంతో సాగర్ ప్రాజెక్టు నీటిమట్టం పూర్తిస్థాయికి చేరుకుంది. సాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు (312.0450టీఎంసీలు) కాగా బుధవారం సాయంత్రానికి 590 అడుగులకు (312.0450టీఎంసీలు) చేరుకుంది. శ్రీశైలం ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 885 అడుగులు (215.8070టీఎంసీలు) కాగా శ్రీశైలానికి ఎగువ నుంచి 1,15,976 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుండటంతో శ్రీశైలం నీటి మట్టం 880.80 అడుగులుగా (192.5300టీఎంసీలు) ఉంది. శ్రీశైలం కుడి, ఎడమగట్టు జలవిద్యుత్ కేంద్రాల్లో విద్యుదుత్పత్తి చేయడం ద్వారా 68,483 క్యూసెక్కుల నీరు సాగర్‌కు వచ్చి చేరుతోంది. దీంతో సాగర్ ప్రాజెక్టు నీటిమట్టం పూర్తిస్థాయికి (590 అడుగులకు) చేరుకుంది. సాగర్ నుంచి కుడి కాల్వ ద్వారా 7,528 క్యూసెక్కులు, ఎడమకాల్వ ద్వారా 7,601 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 29,394 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1,800క్యూసెక్కులు, వరద కాల్వ ద్వారా 600 క్యూసెక్కులు, రెండు క్రస్ట్‌గేట్లను ఐదు అడుగుల మేర ఎత్తి 16,200 క్యూసెక్కులు, మొత్తం 63,123 క్యూసెక్కుల నీరు విడుదలవుతుండగా ఎగువ నుంచి 68,483 క్యూసెక్కుల నీరు సాగర్‌కు వచ్చి చేరుతోంది.

17 రోజుల్లో పూర్తిస్థాయి నీటిమట్టం

కృష్ణాబేసిన్‌లో కురుస్తున్న వర్షాలతో సాగర్ జలాశయానికి జూలై 29వ తేదీన వరద రాక ప్రారంభమైంది. డెడ్ స్టోరేజీకి దిగువన(503అడుగులు) ఉన్న సాగర్ నీటిమట్టం 17 రోజుల్లో పూర్తిస్థాయి నీటిమట్టానికి (590 అడుగులు) చేరుకుంది.

642 అడుగులకు చేరిన 'మూసీ' నీటిమట్టం

ఎగువ మూసీ పరివాహక ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు దిగువన గల ప్రాజెక్టుకు బుధవారం మరోసారి ఇన్‌ఫ్లో పెరిగింది. రెండు రోజులుగా నిలకడగా కొనసాగిన ఇన్‌ఫ్లో ఎగువన కురుస్తున్న వర్షాలతో బుధవారం పెరిగింది. దీంతో మూసీ ప్రాజెక్ట్ నీటిమట్టం 642 అడుగులకు చేరింది. ఎగువ నుంచి ప్రాజెక్టులోకి వచ్చే ఇన్‌ఫ్లో మంగళవారం సాయంత్రానికి 793.39 క్యూసెక్కులుగా ఉండగా బుధవారం సాయంత్రానికి 1232.51 క్యూసెక్కులుగా నమోదైంది. 645 అడుగుల (4.46 టీఎంసీలు) పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం గల మూసీ ప్రాజెక్టు నీటిమట్టం ప్రస్తుతం 642.15 అడుగులుగా (3.73టీఎంసీ) ఉంది. మరోవైపు మూసీ ఆయకట్టులో వానాకాలం పంటల సాగు కోసం ప్రాజెక్టు కుడికాల్వకు 257.89 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 257.89 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

చికిత్స పొందుతూ జీపీ కార్మికుడి మృతి

పెన్‌పహాడ్, ఆగస్టు 14: ఆత్మహత్యా యత్నం చేసిన గ్రామ పంచాయతీ కార్మికుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్ఐ పెరక రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండలం దర్శాపురం గ్రామానికి చెందిన నెమ్మాది వెంకన్న(50) ఈనెల ఏడో తేదీ మద్యాహ్నం ఎక్కడో పురుగుమందు తాగి ఆ దుబ్బాతో ఇంటికి వచ్చి స్పృహ కోల్పోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే చికిత్స కోసం 108అంబులెన్సులో సూర్యాపేట జనరల్ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ వెంకన్న మంగళవారం మృతి చెందాడు. ఆరోగ్యరీత్యా ఆరు నెలలుగా వెంకన్న ఇబ్బంది పడుతున్నారని, మనస్తాపంతోనే ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. వెంకన్నకు భార్య, కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. వెంకన్న మృతదేహానికి పోస్టుమార్టం చేయించి బంధువు లకు అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడి కుమారుడు వంశీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



వెంకన్న (ఫైల్ ఫొటో)

భర్త కళ్లెదుటే భార్య మృతి

అర్వపల్లి, ఆగస్టు 14: రోడ్డు ప్రమాదంలో భర్త కళ్లెదుటే భార్య మృతి చెందింది. ఈ ఘటన సూర్యాపేట జిల్లా జాజిరెడ్డిగూడెం మండలంలోని వేల్పు చర్ల స్టేజీ వద్ద మంగళ వారం జరిగింది. ఎస్ఐ బాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. ఆడివెంల గ్రామానికి చెందిన రిటైర్డు ఉపాధ్యాయుడు గోల్కొండ బాలనర్సయ్య-లక్ష్మి(65) దంప తులు కుమారుడి వద్దకు మోటర్ బైక్‌పై అర్వపల్లి సంతకు వెళ్లారు. సంతలో సరుకులు కొనుగోలు చేసి స్వగ్రామం ఆడివెంల గ్రామానికి వెళ్తు తుండగా మార్గ మధ్యలో వేల్పుచర్ల స్టేజీ వద్ద ఎదురుగా వస్తున్న కారును తప్పించబోయే క్రమంలో బైక్ రోడ్డుపై ఉన్న బండరాయిని ఎక్కింది. ఆకస్మాత్తుగా బైక్ వెనుక కూర్చున్న లక్ష్మి రోడ్డు మీద పడి తల వెనకభాగాన తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందగా, బాల నర్సయ్యకు గాయాలయ్యాయి. రక్తస్రావంతో ఉన్న భార్యను అక్కున చేర్చుకుని విలపిస్తూ అమ్మ చనిపోయిందని దుబాయ్ కుమారుడు, కుమార్తెకు ఫోన్‌లో చెప్పడం చూసి చూపరులు కంటతడి పెట్టారు. గ్రామంలో బాలనర్సయ్య-లక్ష్మి దంపతులు అందరితో కలివిడిగా ఉండేవారు. లక్ష్మి మృతదేహానికి పోలీసులు తుంగతుర్తి ఆసుపత్రిలో పోస్టుమార్టం చేయించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. లక్ష్మి అంత్యక్రియలు బుధవారం గ్రామంలో నిర్వహించారు. మృతురాలి కుమారుడు శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తు న్నట్లు ఎస్ఐ బాలకృష్ణ తెలిపారు.



ఒడిలో భార్య మృతదేహంతో బంధువులకు సమాచారం ఇస్తున్న భర్త



సాయుధ పోరాటంతోనే తరిమికొట్టాలి

ఓ వైపు గాంధీజీలాంటి వారు అహింసతోనే స్వరాజ్యం సిద్ధిస్తుందని నమ్మి పోరాటం చేస్తుంటే సుభాష్ చంద్ర బోస్ మాత్రం 'సాయుధ పోరాటం' ద్వారానే ఆంగ్లేయులను దేశం నుంచి తరిమి కొట్టాలని నమ్మి, దాన్ని ఆచరణలో పెట్టారు. జాతీయ కాంగ్రెస్‌కు రెండుసార్లు అధ్యక్షుడిగా ఎన్నికైన బోస్ గాంధీజీతో అభిప్రాయ బేధాలు వచ్చి ఆ పదవికి రాజీనామా చేశారు. గాంధీ అహింసావాదం మాత్రమే సరిపోదని, పోరుబాట కూడా ముఖ్యమని నమ్మి ఇండియా ఫార్వర్డ్ బ్లాక్‌ను ఏర్పాటు చేశారు. రష్యా, జర్మనీ, జపాన్‌లలో పర్యటించి, ప్రత్యేక ఆర్మీని తయారు చేశారు. జపాన్ సహాయంతో భారత యుద్ధ ఖైదీలు, రబ్బరు తోట కూలీలు, ఔత్సాహికులను ఆర్మీలో చేర్చుకున్నారు. చివరగా విమాన ప్రమాదంలో మృత్యువాత పడ్డారన్న వార్తలు వినిపించాయి.



ఇంక్విలాబ్ జిందాబాద్

నేటి పాకిస్తాన్‌లోని లాయల్ జిల్లా బంగా గ్రామంలో పుట్టిన భగత్‌సింగ్ ఇంక్విలాబ్ జిందాబాద్ (విప్లవం వర్ధిల్లాలి..) అంటూ ఢిల్లీ వీధుల్లో ఎర్ర కాగితాలు చల్లి ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చారు. యుక్త వయస్సులోనే ఐరోపా ఉద్యమాలను చదివిన భగత్‌సింగ్ అరాచకవాదం, సామ్యవాదం మునకు ఆకర్షితుడయ్యాడు. భారత, బ్రిటన్ రాజకీయ ఖైదీలకు సమాన హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. బ్రిటీష్ వారి అరాచక నిర్ణయాలను మొదటి నుంచి వ్యతిరేకించి వారి కంటిలో నలుసుగా మారారు. బ్రిటీష్ అధికారి జేపీ శాండర్స్ హత్యలో భగత్‌సింగ్ ప్రమేయం ఉందని, రాజ్‌గురు, సుఖ్ దేవ్‌లతో కలిపి ఉరి తీయబడ్డారు.

ప్రతీ ఇంటిపై జాతీయజెండాను ఎగురవేయాలి





నారాయణపురంలో తిరంగా ర్యాలీ నిర్వహిస్తున్న బిజెపి నాయకులు, విద్యార్థులు, ర్యాలీనుద్దేశించి మాట్లాడుతున్న ప్రకాష్‌రెడ్డి



అడ్డగూడూరులో జాతీయ జెండాలను ప్రదర్శిస్తున్న నాయకులు

సంస్థాన్‌నారాయణపురం, ఆగస్టు 14: జాతీయ జెండాను భారత మాతగా భావించాలని, ప్రతి ఇంటిపైన జాతీయ జెండాను ఎగురవేయాలని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ సమ్మిడి ప్రకాష్‌రెడ్డి కోరారు. సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో బీజేవైఎం, బీజేపీ సంయుక్త ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా యాత్రను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు బిజెపి శ్రేణులు మువ్వన్నెల జెండాను చేతబట్టి మండల కేంద్రంలోని ప్రధాన వీధుల్లో జాతీయ, దేశభక్తి నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా సమ్మిడి ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ ప్రధాని మోదీ భారత స్వాతంత్ర దినోత్సవాన్ని దేశమంతా పండగ వాతావరణంలో నిర్వహించుకోవాలని సూచించారని ఎతలిపారు. అందులో భాగంగా గత మూడు రోజులుగా దేశభక్తికి సంబంధించిన వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దేశం కోసం పోరాడిన యోధులను స్మరించుకుని, వారి త్యాగాల కారణంగానే మనం స్వేచ్ఛగా ఉన్నామనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాశం భాస్కర్ మాట్లాడుతూ చిన్నతనం నుంచి దేశభక్తినీ పెంపొందించుకోవాలనీ, ఇలాంటి కార్యక్రమాల వల్ల ఐకమత్య భావన పెరుగుతుందని ఆయన అన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దోనూరు వీరారెడ్డి, నాయకులు బచనబోయిన దేవేందర్, జక్కలి రాజు, సుర్వీ రాజుగౌడ్, భాస్కర్ నరసింహ, దాసోజు వెంకటాచారి, నందగిరి జగత్, జక్కర్తి బిక్షం, వంగరి రఘు, ఉప్పాగుల గిరిబాబు, రాపర్తి ప్రదీప్, బండమీది కిరణ్, శీను, వెంకటేష్ పాల్గొన్నారు.



వలిగొండలో జాతీయ జెండాలను పంపిణీ చేస్తున్న నాయకులు

యాదగిరిగుట్ట రూరల్: స్వాతంత్ర్యం కోసం పోరాడిన అమరుల త్యాగాలను మరవద్దని బీజేపీ రాష్ట్ర నాయకుడు వట్టిపల్లి శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. యాదగిరిగుట్టలో బీజేపీ ఆధ్వర్యంలో చేపట్టిన హర్ ఘర్ తిరంగా యాత్రను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు రచ్చ శ్రీనివాస్, మండల అధ్యక్షుడు గుంటిపల్లి సత్యనారాయణ, జిల్లా కార్యదర్శి కాదూరి అచ్చయ్య, ఎస్టీమోర్చ జిల్లా అధ్యక్షుడు ఆజీమీర కిషన్‌నాయక్, బొమ్మగాని రాజమణి, బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శి ఆకుల చంద్రమౌళి, నాయకులు బోడ బుచ్చిబాబు, మందోజు నరేష్, బూడిద నవీన్, కర్రె శ్యామ్, విజయ్, సందీప్, శివ పాల్గొన్నారు.

అడ్డగూడూరు: మండల కేంద్రంలో స్వాతంత్ర్య సమరయోధులు, మహనీయుల విగ్రహాలను శుభ్రపరిచారు. తదనంతరం మహనీయుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జాతీయ జెండాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ అసెంబ్లీ జాయింట్ కన్వీనర్ వెంకటేశ్వర్లు, బీజేపీ మండల అధ్యక్షుడు సైదులు ఉన్నారు.

వలిగొండ: మండల కేంద్రంలో బీజేవైఎం జిల్లా కార్యదర్శి రేగురి అమరేందర్ గ్రామస్థులకు 50 జాతీయ జెండాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులు బచ్చు శ్రీనివాస్, బీజేవైఎం అసెంబ్లీ కన్వీనర్ బుంగమట్ల మహేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు అరుణ్, నరేష్, నాయకులు వెంకటేష్, రమేష్, మత్స్యగిరి పాల్గొన్నారు.

భువనగిరి రూరల్: ప్రతీ ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి దేశ ఔన్నత్యాన్ని పెంపొందించే విధంగా ప్రతీ ఒక్కరు కృషి చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు చీర్క సురేశ్ రెడ్డి అన్నారు. భువనగిరి మండలం తుక్కాపురంలో హర్‌ఘర్ తిరంగ యాత్రలో భాగంగా ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చందా మహేందర్ గుప్తా, జిల్లా కో కన్వీనర్ పాదరాజు ఉమాశంకర్, కిసాన్‌మోర్చా మండల అధ్యక్షులు పనుమటి మాణిక్యం రెడ్డి, నాయకులు వెంకటేశ్, వినోద్, సురేశ్, కిశోర్, నగేశ్, ఉపేందర్ ఉన్నారు.



భువనగిరిలో బైక్‌ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు



యాదగిరిగుట్టలో ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు



భువనగిరి మండలం తుక్కాపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

మునిసిపాలిటీలోని సమస్యలు పరిష్కరించాలి



మునిసిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న అఖిలపక్ష నాయకులు

మోత్కూరు, ఆగస్టు 14: మునిసిపాలిటీలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అఖిల పక్ష నాయకులు బుధవారం మునిసిపల్ కమిషనర్ సి.శ్రీకాంత్‌కు వినతి పత్రం అందజేశారు. రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నందున ఎస్‌బీఐ వద్ద రోడ్డుపై వాహనాలు పార్కింగ్ చేయడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతోందని, బ్యాంకు వినియోగదారులు వేరే చోట వాహనాలు పార్కింగ్ చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. చికెన్, మటన్ దుకాణాలను పట్టణం వెలుపల ఏర్పాటు చేయించాలని, ఇళ్ల మధ్య కొందరు ఫామ్‌హౌజ్‌లు ఏర్పాటు చేసి అందులో పశువులను ఉంచడం వల్ల పశువుల మలమూత్రాలతో దుర్వాసన రావడంతో పాటు ఈగలు, దోమల బెడద పెరిగి విష జ్వరాల బారిన పడుతున్నారని నాయకులు ఆయనకు వివరించారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం నర్సింహ, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుండగోని రామచంద్రు, నాయకులు అవిశెట్టి అవిలిమల్లు, బయ్యని రాజు, సీపీఐ మండల, పట్టణ కార్యదర్శులు అన్నెపు వెంకట్, పుల్కరం మల్లేష్, సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బొల్లు యాదగిరి, టీడీపీ మండల అధ్యక్షుడు సత్యనారాయణచారి పాల్గొన్నారు.

స్వచ్ఛమైన నీటినే తాగాలి



వాటర్ ప్లాంటును ప్రారంభిస్తున్న తహసీల్దార్ హరికృష్ణ

చౌటుప్పల్ రూరల్, ఆగస్టు 14: ప్రజలు అనారోగ్యాలకు గురికాకుండా స్వచ్ఛమైన నీటినే తాగాలని చౌటుప్పల్ తహసీల్దార్ హరికృష్ణ కోరారు. బుధవారం మండల పరిధిలోని రెడ్డిబావిలో దివీస్ ల్యాబొరేటరీస్ లిమిటెడ్ ఆధ్వర్యంలో రూ.9.73లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంటును హరికృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా హరికృష్ణ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి పరిశ్రమలు చేయూత అందించాలని కోరారు. వాటర్ ప్లాంటును ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి ధనలక్ష్మి, దివీస్ సిబ్బంది వంశీకృష్ణ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

దివ్యాంగులు ప్రశాంత జీవనం కొనసాగించాలి



ర్యాలీలో పాల్గొన్న దివ్యాంగులు

చౌటుప్పల్ టౌన్, ఆగస్టు 14: కండరాల క్షీణత దివ్యాంగులు ధైర్యాన్ని కోల్పోకుండా జీవితాలను ప్రశాంతంగా కొనసాగించాలని చౌటుప్పల్ ఏసీపీ మధుసూదన్ రెడ్డి అన్నారు. చౌటుప్పల్ పట్టణంలో బుధవారం సీవియర్ డిజేబులిటీ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 20మంది దివ్యాంగులకు రూ.2000విలువైన నిత్యావసర సరుకులను ఏసీపీ అందజేశారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు కత్తుల బాలకృష్ణ, ప్రతిభ ఒకేషనల్ కాలేజీ ప్రిన్సిపాల్ చిలువేరు శ్రీనివాస్ పాల్గొన్నారు. అనంతరం స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని జాతీయ రహదారిపై జాతీయ పతాకాలను ధరించి కండరాల క్షీణత బాధితులు ర్యాలీ నిర్వహించారు.

డీఆర్‌డీఏ అసిస్టెంట్ విజిలెన్స్ ఆఫీసర్‌గా ఉపేందర్‌రెడ్డి



విజిలెన్స్ అధికారిగా బాధ్యతలు స్వీకరిస్తున్న ఉపేందర్‌రెడ్డి

భువనగిరి అర్బన్, ఆగస్టు 14: ఉద్యోగ జేఏసీ ఛైర్మన్ మందడి ఉపేందర్‌రెడ్డి బుధవారం కలెక్టరేట్ డీఆర్డీఏ జిల్లా అసిస్టెంట్ విజిలెన్స్ ఆఫీసర్‌గా బాధ్యతలు స్వీకరించారు. టీఎన్జీవో జిల్లా అధ్యక్షులు భగత్, కలెక్టరేట్ ఏవో జగన్మోహన్ ప్రసాద్, కార్యదర్శి ఖదీర్, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, కోశాధికారి శ్రీకాంత్, రమణ, విశ్రాంత ఉద్యోగి కృష్ణ, డీఆర్డీఏ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

వరద నీటి సమస్యలను పరిష్కరిస్తాం



పనులను పరిశీలిస్తున్న వార్డు కౌన్సిలర్ ప్రమోద్‌కుమార్

భువనగిరి టౌన్, ఆగస్టు 14: భువనగిరిలోని హౌసింగ్‌బోర్డ్ కాలనీ మురికి, వరద నీటి సమస్యలను పరిష్కరిపస్తామని 10వార్డు కౌన్సిలర్, టీపీపీసీ ప్రధాన కార్యదర్శి పోత్నక్ ప్రమోద్‌కుమార్ అన్నారు. వార్డులో నెలకొన్న సమస్యలను బుధవారం ఆయన పరిశీలించారు. పారిశుధ్య కార్మికులతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పైపులైన్ పూడిక పనులను పూర్తి చేయించారు. అలాగే సమస్యకు శాశ్వత పరిష్కారంగా చేపట్టిన నూతన పైపులైన్ పెండింగ్ పనులను ఓ బస్తీలో పూర్తి చేయించారు. త్వరలోనే మరన్ని పనులు చేపడుతున్నామన్నారు.

విద్యానిధి పథకానికి దరఖాస్తుల ఆహ్వానం

భువనగిరి అర్బన్, ఆగస్టు 14: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విదేశీ విద్యానిధి పథకం కింద విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ఎస్సీ కులాల అభివృద్ధి అధికారి ఓం జైపాల్‌రెడ్డి బుధవారం తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరానికి గాను ఈ పథకం కింద జిల్లా ఎస్సీ కులములకు చెందిన అర్హులైన విద్యార్థినీ విద్యార్థులు విదేశాల్లో ఉన్నత చదువులకు ఉపకార వేతనాల కోసం దరఖాస్తు చేసుకోవాలని, 2024 ఆగస్టు 14నుంచి అక్టోబరు 31వరకు వెబ్‌సైట్ https://telanga naepass.gov.in లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

విద్యుదాఘాతంతో ఇద్దరికి గాయాలు

రాజాపేట, ఆగస్టు 14: బోరు పైపులు తీస్తుండగా విద్యుత్ షాక్‌కు గురై ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బొందుగుల గ్రామంలో శ్రీనివాస్‌రెడ్డి వ్యవసాయ వద్ద బోరు మోటర్ కాలిపోవడంతో ఇదే గ్రామానికి చెందిన మోటర్ మెకానిక్ ఉప్పరి సిద్దులు, తరిగొప్పుల కరుణాకర్ బుధవారం బోర్‌పైపులను తీస్తున్న క్రమంలో పైపులు పక్కనే ఉన్న విద్యుత్ తీగలకు తగలడంతో ప్రమాదం జరిగింది. దీంతో కరుణాకర్, సిద్దులకు తీవ్ర గాయాలు అవ్వడంతో సిద్దులు చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి, కరుణాకర్ భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

ప్రభుత్వ నిబంధనలను పాటించాలి : డీపీవో



బాలంపల్లిలో ఎల్ఆర్ఎస్ దరఖాస్తు చేసుకున్న ప్రాంతాన్ని పరిశీలిస్తున్న డీపీవో సునంద

భువనగిరి రూరల్, ఆగస్టు 14: ప్రభుత్వ నియమ నిబంధనలను పాటించి లే అవుట్ల క్రమబద్ధీకరణకు సిబ్బంది పారదర్శకంగా క్షేత్రస్థాయి పరిశీలన నిర్వహించాలని జిల్లా పంచాయతీ అధికారి ఆర్.సునంద సూచించారు. బుధవారం భువనగిరి మండలం బాలంపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో ల్యాండ్ రెగ్యులరైజేషన్ స్కీం (ఎల్ఆర్ఎస్)కింద దరఖాస్తు చేసుకున్న భూములను ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్లాట్లు కొనుగోలు చేసిన యజమానులు ఇటీవల ఎల్ఆర్ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్నారని, వారికి సంబంధించిన దరఖాస్తులను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీవో దినకర్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్ ఉన్నారు.

పేదలకు మెరుగైన వైద్య సేవలందించాలి

డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ శిల్పిని

భువనగిరి రూరల్, ఆగస్టు 14: ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రంలో వైద్య సేవల కోసం వచ్చిన పేదలకు మెరుగైన సేవలందించాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ శిల్పిని అన్నారు. బుధవారం భువనగిరి మండలం బొల్లేపల్లి ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రంలో హెల్త్‌మేళా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ వివిధ విభాగాలకు సంబంధించిన వైద్యులు అర్హులైన పేద లబ్ధిదారులకు అన్ని రకాల సేవలు అందించి, వారి ఆరోగ్య సంరక్షణకు కృషి చేయాలన్నారు. అదే విధంగా ఆయుష్మాన్ హెల్త్ కార్డులను జారీ చేశారు. వ్యక్తిగత పరిశుభ్రత, ఆహార వైవిధ్యం, ఆల్కాహాల్, పొగాకు, డ్రగ్స్ తదితర పదార్థాలను వినియోగించినట్లయితే ఆరోగ్య పరంగా ఇబ్బందులు ఉంటాయని ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. ఎంపీడీవో సీహెచ్ శ్రీనివాస్, మండల వైద్యాధికారి డాక్టర్ యామిని, సిబ్బంది పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ శిల్పిని

పథకాలు అర్హులకు అందించాలి



ఎంపీడీవోను కలిసిన మండల పంచాయతీ కార్యదర్శుల నూతన కార్యవర్గ సభ్యులు

భువనగిరి రూరల్, ఆగస్టు 14: ప్రజలకు అందుబాటులో ఉండి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను అర్హులకు అందించాలని ఎంపీడీవో సీహెచ్ శ్రీనివాస్ సూచించారు. బుధవారం తెలంగాణ పంచాయతీ కార్యదర్శుల సెంట్రల్ ఫోరం మండల నూతన కార్యవర్గాన్ని ఎంపీడీవో సీహెచ్.శ్రీనివాస్, ఎంపీవో ఎం.దినకర్‌గౌడ్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా వరకాల శ్రీనివాస్ రెడ్డి, గౌరవ అధ్యక్షులుగా వై.ఆనంద్ రావు, ఉపాధ్యక్షులుగా కె ఆమని, ఎండి ఫర్విన్, ప్రధాన కార్యదర్శిగా గోపాల నర్సింగ్‌రావు, సంయుక్త కార్యదర్శులుగా మొనగాల శ్రీనివాస్, మంజుల, కోశాధికారిగా ఎం రాంబాబును ఏక గ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారిగా వ్యవహరించిన ఎంపీవో దినకర్ తెలిపారు.

మాజీ సర్పంచ్ బాలింగయ్య కన్నుమూత



బాలింగయ్య(ఫైల్ ఫొటో)

రాజాపేట, ఆగస్టు 14: రాజాపేట మండలం సింగారం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ వంపు బాలింగయ్య (75) బుధవారం కన్నుమూశారు. కొంత కాలంగా ఆయన అనారోగ్యానికి గురయ్యారు. ఆయనకు ఇద్దరు కుమారులు, ఆయన కుటుంబాన్ని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య పరామర్శించి నివాళులర్పించారు. మండలంలోని పలువురు ప్రజాప్రతినిధులు సంతాపన్ని వ్యక్తం చేశారు.

విద్యార్థులు ఇష్టంతో చదవాలి



విద్యార్థులకు టై, బెల్టులను అందజేస్తున్న ప్రధానోపాధ్యాయుడు మాధవరెడ్డి

రాజాపేట, ఆగస్టు 14: విద్యార్థులు ఇష్టంతో చదవాలని పలువురు సూచించారు. మండలంలోని రఘునాథ్‌పూర్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పెంటపర్తి మాధవరెడ్డి, టై, బెల్ట్, ఐడీకార్డులను పంపిణీ చేశారు. ఆయన తల్లి జ్ఞాపకార్థం రూ.15వేల విలువైన టై బెల్టులను అందజేశారు. కార్యక్రమంలో రేణుక పెంటయ్య గౌడ్, మనోజ్‌కుమార్, సత్యనారాయణ, కృష్ణమూర్తి, పార్వతి పాల్గొన్నారు.

యువ చైతన్య కళానిలయం అధ్యక్షుడిగా బలరాం



బలరాంను సన్మానిస్తున్న నాయకులు

భూదాన్ పోచంపల్లి, ఆగస్టు 14: పట్టణ పరిధిలోని ముక్తాపూర్ గ్రామానికి చెందిన యువ చైతన్య కళానిలయం నూతన కమిటీ అధ్యక్షుడిగా ఇటమోని బలరాం ఎన్నికయ్యారు. కళానిలయం మాజీ అధ్యక్షుడు మోడెపు అశోక్ ఆధ్వర్యంలో గురువారం కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా ఇటమోని బలరాం, ఉపాధ్యక్షులుగా దొరగండ్ల రవి, గౌరవాధ్యక్షులుగా ఇటమోని నరసింహ, ఇటమోని పాండు, సిద్దగోని పాండు, ఇటమోని శ్రీను, సహాయ కార్యదర్శి సన్న శ్రీశైలం, క్రీడల కార్యదర్శి ఇటమోని మహేష్, కార్యవర్గ సభ్యులుగా కుతాడి సుధాకర్, ఇటమోని బాలయ్య, సిద్దగోని భాస్కర్, ఇటమోని లింగస్వామి, బాలయ్య ఎన్నికయ్యారు.

బీజేపీనేత చంద్రశేఖర్‌కు పరామర్శ

వలిగొండ, ఆగస్టు 14: బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఏలె చంద్రశేఖర్, అనారోగ్యానికి గురికావడంతో హైదరాబాద్‌లోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా బీజేపీ మండల నాయకులు బుధవారం పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని డాక్టర్‌ని అడిగి తెలుసుకున్నారు. పరామర్శించిన వారిలో.. బీజేపీ మండల అధ్యక్షుడు బోళ్ల సుదర్శన్, జిల్లా కార్యదర్శి కొప్పుల యాదిరెడ్డి, అసెంబ్లీ కో కన్వీనర్ రాచకొండ కృష్ణ, మండల ప్రధాన కార్యదర్శి లోడే లింగస్వామి, మండల కార్యదర్శి మందుల నాగరాజు ఉన్నారు.

చెక్‌డ్యాంకు గండిని పూడ్చివేయాలి



గండిని పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

భువనగిరి రూరల్, ఆగస్టు 14: భువనగిరి శివారులోని అనాజీపురం, ముగ్దుంపల్లి గ్రామాల మధ్య గల చెక్‌డ్యాంకు పడిన గండిని పూడ్చి రైతులకు సాగు నీరు అందించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు కొండమడుగు నర్సింహ, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు మాటూరి బాలరాజు డిమాండ్ చేశారు. బుధవారం భువనగిరి మండలంలోని నమాత్‌పల్లి, అనాజీపురం రైతులతో కలిసి చెక్‌డ్యాంకు గండి పడిన ప్రదేశాన్ని పరిశీలించారు. బునాదిగాని కాల్వకు వచ్చే మూసీ నీటిలో గుర్రపు డెక్క ఆకును తొలగించి నమాత్‌పల్లి, నందనం, ఎర్రబెల్లి చెరువులను నింపాలని కోరారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి దయ్యాల నర్సింహ, నాయకులు ఎదునూరి మల్లేశ్, జిట్టా అంజిరెడ్డి, తోటకూరి మల్లేశ్, సుర్వంగ ప్రకాశ్, రాజు, కిష్టయ్య పాల్గొన్నారు.